క్లుప్తంగా

రేపటి నుంచి అయ్యప్ప స్వామి దేవాలయంలో భిక్ష

గుంటూరు వెస్ట్: బ్రాడీపేట 5/7లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం నుంచి జనవరి 3 వరకు స్వాములకు భిక్ష (అన్న ప్రసాదం) నిర్వహిస్తామని గురుస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 41 రోజుల పాటు రాత్రి 8 గంటలకు భజన అనంతరం భిక్ష జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప స్వాములంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్


గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డు(225)లో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అయితే, సిబ్బంది అప్రమత్తతతో అదుపులోకి తెచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని ఆయన చెప్పారు. వార్డులో ఏసీ నుంచి మంటలు వస్తున్నాయని సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్ చేరుకుని, సిబ్బంది అప్రమత్తం చేసి అదుపులో తెచ్చినట్లు తెలిపారు. రోగుల్ని వెంటనే మరో వార్డుకు తరలించినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. మంటల్లో కాలిపోయిన ఏసీ మిషన్, ఎలక్ట్రిక్ బాక్స్‌లను తొలగించి, వ్యాపించిన పొగల్ని అదుపులోకి తీసుకుని వచ్చినట్లు తెలిపారు. పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులకు సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో వార్డును యథాస్థితికి తీసుకు వస్తామని ఆయన చెప్పారు. సకాలంలో స్పందించిన వైద్య సిబ్బందిని అభినందించారు. విషయాన్ని హెచ్‌డీఎస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, డీఎంఈ డాక్టర్ నరసింహం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

టీఎంబీ క్రికెట్ టోర్నీ విజేత గుంటూరు జట్టు




కొరిటెపాడు: ప్రముఖ ప్రైవేటు బ్యాంకు తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు (టీఎంబీ) లిమిటెడ్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు రీజినల్ మేనేజర్ రాజప్పన్ ఆదేశాల మేరకు బ్రాంచి మేనేజర్ దినకర్ జేబా కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రారంభించారు. గుంటూరు – విజయవాడ జట్ల ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో గుంటూరు జట్టు విజయం సాధించింది. గెలుపొందిన గుంటూరు జట్టుకు, పాల్గొన్న వారికి ఏపీ టెక్స్‌టైల్స్ అండ్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరవల్లి కోటిరావు, తిరుమల కాటన్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ డైరెక్టర్ కరణం పట్టాభి సీతారామారావు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు ప్రముఖులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 3,4 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు మాట్లాడుతూ 'భారతదేశంలో నిజమైన సమగ్ర అభివృద్ధి దిశగా: మహాత్మా జ్యోతిరావు పూలే భావజాలం , సామాజిక ఆచరణ ఔచిత్యం' అనే అంశంపై వచ్చే జనవరి 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించే వారు డిసెంబరు 15వ తేదీలోగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, మహాత్మా జ్యోతిరావ్‌పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: యువకుడి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో నివసించే 17 సంవత్సరాల వేణుగోపాల్ ఆదివారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సిబ్బంది సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని యువకుడ్ని గుర్తించిన వారు 9705643699 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



సచివాలయంలో ప్రదర్శన బోర్డును ఆవిష్కరించిన కమిషనర్ నయీమ్ అహ్మద్, నాయకులు



ఓబులునాయుడుపాలెంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ, మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తదితరులు

పొన్నూరు: ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే ? కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18, 19 వార్డుల పరిధిలోని రెండో సచివాలయంలో సోమవారం వార్డులలో జరిగిన అభివృద్ధి, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన బోర్డును పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వార్డులలో ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలతో ప్రచురించిన పుస్తకాల్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, వార్డు నాయకులు ప్రగాఢ బాలాజీ, దుర్గారావు, మాడుగుల శివయ్య, ఆకుల కృష్ణారావు పాల్గొన్నారు.

జగనన్న ద్వారానే సంక్షేమం, అభివృద్ధి

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తెలిపారు. ఓబులునాయుడుపాలెంలో సోమవారం సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి? అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల గ్రామానికి ఇప్పటి వరకూ జగనన్న అందించిన సంక్షేమ పథకాల పట్టికను ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ప్రజల సమస్యల్ని తెలుసుకుని వారికి ఏమి అవసరమో ఆలోచించి సంక్షేమ పథకాల్ని అందించారని తెలిపారు. తల్లి కడుపులోని బిడ్డ నుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకూ పథకాల్ని వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ఇంటివద్దకే అందిస్తున్నారని చెప్పారు. దేశంలో కనీవిని ఎరుగని రీతిలో 34 లక్షల మందికి ఇళ్ల స్థలాల్ని అందించిన ఘనత జగనన్నకే దక్కిందని వివరించారు. ఓబులునాయుడుపాలెంలో నేటి వరకూ రూ. 21 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లో అందించినట్లు తెలిపారు. చంద్రబాబు హయాంలో ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందేవని, మరలా ఆయన ప్రజల్ని మోసం చేసేందుకు దత్తపుత్రుడుతో కలసి కుట్రలు పన్నుతున్నాడని చెప్పారు. ప్రజలు మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, దాసుపాలె సర్పంచ్, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, సచివాలయం కన్వీనర్లు మొగల్ జిలానీ బేగ్, సూరగాని వేణు, వాకా చన్నయ్య, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ 'సంక్షేమ'ం ముఖ్యమంత్రి లక్ష్యం



వలంటీర్‌కు సంక్షేమ పథకాల కిట్‌ను అందిస్తున్న నేతలు

పెదనందిపాడు: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యం అని మండల కన్వీనర్ షేక్ ఖాసీం పీరా తెలిపారు. మండలంలోని వరగానిలో సోమవారం రాత్రి 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న షేక్ ఖాసీం పీరా మాట్లాడుతూ గ్రామాల్లో విభేదాలు విడనాడి, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని నాయకులకు తెలిపారు. పార్టీ చేస్తున్న కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి బొద్దు మరియమ్మ, వైస్ సర్పంచి దిరిశాల సురేష్, వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు, ఏబీ పాలెం సొసైటీ అధ్యక్షుడు కె. భూషయ్య, పార్టీ కల్చరల్ విభాగం అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, గూడూరి వీరయ్య చౌదరి, సర్పంచులు దాసరి పద్మారావు, సాతులూరి సురేష్, వివిధ గ్రామాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లపాడు శివాలయంలో ప్రత్యేక పూజలు



నల్లపాడు శివాలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామి



పొన్నూరులోని శివాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

గుంటూరు రూరల్: కార్తిక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని నల్లపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామికి అభిషేకాలు, పూజలు, హోమాలు, రుద్రాభిషేకాలు, పంచామృతాషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామికి సహస్ర నామార్చనలు సప్త హారతులు సమర్పించారు. తీర్థ ప్రసాదాల్ని పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు భారీగా కార్తిక దీపాలు వెలిగించారు.

శివాలయాల్లో విశేష అభిషేకాలు, దీపారాధనలు

పొన్నూరు: కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా పొన్నూరులోని శివాలయాల్లో విశేష అభిషేకాలు, దీపారాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఓం నమఃశ్శివాయ నినాదంతో ఆలయాలు మార్మోగాయి. పాత పొన్నూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు విశేషంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేశారు. అర్చకులు నందకుమార్ అభిషేకాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ చుండూరు నరసింహస్వామి, కార్యదర్శి దేవకి వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు.

అధ్యాపకురాలు లక్ష్మీ తిరుపతమ్మకు నేషన్ బిల్డర్ అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ గుంటూరు ఉడాన్ ఆధ్వర్యంలో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకురాలు చల్లా లక్ష్మీ తిరుపతమ్మ నేషన్ బిల్డర్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య సంస్థలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా తమ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ తిరుపతమ్మను కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం, అధ్యాపకులు అభినందించారు.

గ్రంథ పఠనంతో జ్ఞాపకశక్తి, విజ్ఞానం



కాకుమానులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు , అధికారులు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఆళ్ల రవిదేవరాజు, పరమేశ్వరి, వాణి తదితరులు



పెదకాకానిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు

కాకుమాను: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రంథ పఠనంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరడంతో పాటు దేశంలో జరుగుతున్న అనేక విషయాలు తెలుస్తాయన్నారు. ప్రతి విద్యార్థి రోజూ ఒక గంట సమయాన్ని గ్రంథాలయంలో పఠనానికి కేటాయించాలని ఆమె సూచించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో–2 విజయ్ భాస్కర్, గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం నిత్యం చేయాలి

గుంటూరు రూరల్: మనిషి నిత్య జీవితంలో పుస్తక పఠనం భాగం కావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఆళ్ల రవిదేవరాజు, జెడ్పీ హైస్కూలు హెచ్ఎం వై. వాణి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏటుకూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గ్రంథాలయాల్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. జిల్లాలో మొదటగా ఏటుకూరు గ్రంథాలయాన్ని డిజిటల్‌గా మార్చనున్నారని వెల్లడించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.పరమేశ్వరి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వసంతరావు పాల్గొన్నారు.

పుస్తకం ...విజ్ఞాన హారం

పెదకాకాని: అజ్ఞాన గాఢాంధకారాన్ని తొలగించే అక్షర హారం పుస్తకం అని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో సోమవారం వారోత్సవాలు ముగిశాయి. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ దైవం కొలువున్న ప్రదేశం దేవాలయమైతే, జ్ఞాన జ్యోతిని వెలిగించే నిలయం గ్రంథాలయమని తెలిపారు. విద్యార్థులంతా వాటిని సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం వారోత్సవాల్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంఈవో ధారావత్ బలిరామ్, హెచ్ఎం కొల్లిపర ఆనందరావు, మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపాల్, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నాయకులు గోళ్ల శ్యామ్ ముఖర్జీబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి గ్రంథాలయాలు దోహదం

వేజండ్ల(చేబ్రోలు): విద్యార్థుల అభ్యున్నతికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయని హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తాడిబోయిన నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని వేజండ్లలో సోమవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపును ఘనంగా నిర్వహించారు. వేజెండ్ల గ్రంథాలయాధికారి డి. శివనాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డు అధ్యాపకులు, స్థానిక హైస్కూలు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు బండ్లమూడి శివరామకృష్ణ, జి. కమలయ్య, ఎన్. విజయలక్ష్మి పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. పుస్తక పఠనం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, తెలుగు పద్యాలు , డిబేట్, క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల్ని అందజేశారు.



వేజండ్ల గ్రంథాలయంలో జరిగిన వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రతి కుటుంబానికీ సొంతిల్లు ప్రభుత్వాల లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

చినలింగాయపాలెం(కాకుమాను): ప్రతి కుటుంబానికీ సొంతిల్లు కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని చినలింగాయపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆవాస్ దీవాస్, ఆవాస్ సప్తాహ్ అనే అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో దేశ ప్రధాని ఆవాస్ దీవాస్, ఆవాస్ సప్తాహ్ పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. దీనిలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.1.80 లక్షలను అందిస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలకు మరో రూ.35 వేలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని, వాటిని విడతల వారీగా చెల్లించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సత్యనారాయణ, సర్పంచ్ యోహోను, ఎంపీటీసీ సభ్యుడు జూపూడి ఏసేబు, ఈవోపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, ఏఈ మారుతీ బాబు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ క్లరికల్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్‌బీఐ క్లరికల్ ప్రిలిమ్స్ పరీక్షకు డిసెంబర్ 2నుంచి ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు శ్రీషిర్డీ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు వై. అనురాధ సోమవారం తెలిపారు. దరఖాస్తుల కోసం అమరావతి రోడ్డు నగరాలులోని బాలాజీనగర్ 8వ లైనులో గల ట్రస్ట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9704789299, 8686215922 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నగరంలో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం
- ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన 86 అంశాలకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో రూ. 30 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనుల్ని నిర్వహించడానికి స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినట్లు చైర్మన్, మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం మేయర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన 86 అంశాలకు సంబంధించిన అంచనాలకు, అధికారులు ప్రతిపాదనలు చేసిన అభివృద్ధి పనులకు సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో కుల, మత పార్టీలకతీతంగా, ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పేదలు అధికంగా నివసించే ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు చేసుకోవడానికి పెద్ద ఫంక్షన్ హాల్స్‌కి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి ప్రాంతాల్లో నగరపాలక సంస్థ తరఫున కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని తెలిపారు. నగరంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామని చెప్పారు. విలీన గ్రామాల్లో నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు సంకూరి శ్రీనివాసరావు, కాండ్రుకుంట గురవయ్య, మల్లెబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేడ్కర్, శ్యామల వెంకటరమణాదేవి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సీపీ ప్రదీప్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే కీలకం



మాట్లాడుతున్న యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్

లక్ష్మీపురం: ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే కీలకమని ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. టి.ఎన్ శేషన్ లాంటి కమిషనర్లు ఉన్నప్పుడే ఎన్నికలు సక్రమంగా జరుగుతాయని అభిప్రాయపడ్డారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్రపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను సక్రమంగా నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన గురుతర బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు ఎన్నికల కమిషన్‌పై ఉంచారని గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయుడు టి.నారపరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఒక్కో నియోజకవర్గంలో గెలుపు కోసం కోట్ల రూపాయలు గుమ్మరిస్తున్నారన్నారు. నియమావళి, నిబంధనలు ఫైళ్లకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో శేషన్ లాంటి నిజాయతీపరుడైన అధికారి ఉంటేనే ఈసీ స్వయం ప్రతిపత్తి, సమగ్రత నిలబడతాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు నిప్పంటించిన ఆగంతకులు

పట్నంబజారు: గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌పోర్ట్ లారీల్ని తగులబెట్టిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాలాపేటలోని గ్రంధి ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన రెండు లారీల్ని ఆదివారం రాత్రి ఏటుకూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి నిప్పంటించడంతో అవి తగులబడ్డాయి. అందులో పార్శిల్స్, చెప్పులు, ఎరువులతో పాటు పలు రకాల వస్తువులున్నాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు. సుమారు రూ. 30 లక్షల మేరకు నష్టం జరిగి ఉంటుందని తెలుస్తోంది. ట్రాన్స్‌పోర్టు యజమాని గ్రంధి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.